
# [illegible]



[illegible]

"ఏ తీరుగ నను దయజూచెదవో
ఇనవంశోత్తమ రామా..."

ఈ పాటంటే గోపాలానికి చాలా ఇష్టం. అతడు శ్రీరామ భక్తుడు. రామ నామం ఎప్పుడూ స్మరిస్తూనే వుంటాడు. ప్రతిరోజూ తన యిష్టదైవానికి పూజ చేస్తాడు.

శ్రీరాముడు, సీత విగ్రహాల పక్కనే ఒక మట్టి హుండీ వుంటుంది. అందులో ఎంతో కొంత డబ్బు రోజూ అతడు వదేస్తూనే వుంటాడు. పసుపుకుంకుమలతో హుండీ కొత్త రంగులను సంతరించుకొని మెరుస్తూ వుంటుంది.

ఆ రోజు గోపాలం పూజ ముగించి వెనక్కు తిరిగాడు. భార్య కాంతమ్మ నేలమీద కూర్చొని వుంది.

"ఏమండీ, ఆ హుండీ పట్టుకెళ్లి యివ్వొచ్చుగా?" అందామె.

అతడు మౌనంగా హుండీవైపు చూశాడు. అది కొని సంవత్సరం దాటింది. పూర్తిగా నిండాక దాన్ని తీసుకెళ్లి సమీపంలో వున్న రామాలయంలో యివ్వాలని అతని వుద్దేశం.

"హుండీ యింకా నిండలేదే. పూర్తిగా నిండాక శ్రీరాములవార్కి సమర్పించుకుంటాను," అన్నాడతను.

అతడు పూజగదిలోంచి బయటకొచ్చాడు.

"అబ్బిగాడు ఏడే?"

అబ్బిగాడు అతని సుపుత్రుడు. ఒక్కగానొక్క కొడుకు. అసలు పేరు చలపతి. బి. ఎ. ఫైనల్ పరీక్షలకు కూర్చోబోతున్నాడు.

"వాడు పెరట్లో చెట్టుకింద కూర్చొని చదువుకుంటున్నాడు. పరీక్షలు గదా?" అందామె.

"చదువుతున్నాడో, లేక బీడీలు ఊదేస్తున్నాడో ఆ రామచంద్రుడికే తెలియాలి," అన్నాడు గోపాలం చిరునవ్వుతో.

గోపాలానిది చిన్న కుటుంబం. అతడు లారీ ఆఫీసులో పనిచేస్తున్నాడు. సుఖంగా జీవితం సాగిపోతోంది.

వున్నదానితో తృప్తిపడే మనిషతను. మనిషి కోరేది ఆనందం. ఆ ఆనందాన్ని పొందే అవకాశం ప్రతి జీవికీ వుంది. ఎక్కువ డబ్బుతో మనిషి ఆనందాన్ని ఎక్కువగా పొందగలడనే నమ్మకం అతడికి లేదు.

"రండి, టిఫిన్ తిందురుగాని!" అంది కాంతమ్మ.

రాముని పేరు స్మరిస్తూ అతడు వంటింట్లోకి వెళ్లి పీటమీద కూర్చున్నాడు. భార్య యిచ్చిన టిఫిన్ దైవప్రసాదంగా భావిస్తూ తినసాగాడు.

* * *

గోదావరి నది ఒడ్డున నలుగురు మిత్రులూ కూర్చున్నారు పరీక్షలు అయిపోయాయి.

చల్లటి గాలి వీస్తోంది.

"చలపతి, ఏంరా, పాసవుతావా?" అడిగాడు కిషోర్.

"ఫస్టుక్లాసులో పాసవుతానురా!" అన్నాడు చలపతి.

"ఇంతవరకూ నీ కెప్పుడేనా ఫస్టు క్లాస్ వచ్చిందట్రా?" అడిగాడు గోపి

అందరూ నవ్వారు. చలపతి అందరి వైపూ చూశాడు

"ఇంతకుముందు రాకపోయినా యీసారి ఫస్ట్‌క్లాస్ వస్తుందిరా! చూద్దురు గాని" అన్నాడు చలపతి.

"చాలా ధైర్యంగా చెబుతున్నావే, పేపర్లు నువ్వే దిద్దుతున్నట్లు?" అన్నాడు చలం.

అందరూ విరగబడి నవ్వారు.

"పేపర్లు ఎవరు దిద్దినా ఫస్ట్‌క్లాస్ నర్దవ్‌రా!"

"అయితే మాకు పార్టీ యివ్వేయిరా!" అన్నాడు చలం.

"ఫలితాలు తెలియకుండా పార్టీ ఏమిట్రా?" అడిగాడు చలపతి.

చలం జతదివంక సూటిగా చూశాడు. చలం చక్కగా మాట్లాడగలడు.

మాటల్లో యితర్లను బోల్తా కొట్టించగలడు.

"ఫస్ట్‌క్లాస్‌లో వస్తానన్నావుగా?" చలం ప్రశ్న.

"రావాలిగా!"

"నీ మీద నీకు నమ్మకం లేదా?"

"ఎందుకు లేదు?"

"అంత నమ్మకం వుంటే ఫలితాం కోసం వేచివుండడం ఎందుకురా?" అడిగాడు చలం.

"మూర్ఖం మంచిదిరా!"

"తప్పుకి లిప్పుకి మధ్య ఏదైనా ప్రమాదం వుండొచ్చని నీ భయమా?"

"నాన్‌సెన్స్, నాకు భయమేమిటి? ఫస్ట్‌క్లాస్‌లో వస్తానని ఢంకా కొట్టి చెప్తాను!"

"నువ్వు ఏంచేస్తే ఏం లాభం. మేం నీ మాటల్ని నమ్మినపుడు." అన్నాడు చలం.

"ఏం చెప్తే మీరు నమ్ముతార్రా?"

"ఒరేయి, నెపోలియన్ పేరు విన్నావుగా! అతడు ఎప్పుడూ యుద్ధాల్లో నెగ్గేవాడు. తన సైన్యాలను మరో దేశం మీదకు పంపి, విజయాన్ని ముందుగా అతడు సెల్కిబేట్ చేసుకునేవాడు. అలా నువ్వు కూడా చేస్తే, నెపోలియన్ పక్క

నిన్ను కూర్చోబెట్టి పూజిస్తాం," అన్నాడు చలం.

"బాగా చెప్పావురా," అన్నాడు కిషోర్, గోపీలు.

"ఏం చెయ్యాలో చెప్పండి!"

"నువ్వు ఫస్ట్‌క్లాస్‌లో రావడం నెపోలియన్ విజయంలా ఖాయం! మాకు పార్టీ యిచ్చేయి," అన్నాడు చలం.

"ఇస్తానులేరా," అన్నాడు చలపతి యిక వాదించలేక.

"అయితే పార్టీ ఎప్పుడు?" అడిగాడు కిషోర్.

"డబ్బు సర్దుబాటు కావాలిగా!" అన్నాడు చలపతి

"ఒరేయ్, మేం నిన్ను తీసుకెళ్లి నెపోలియన్ సరసన కూర్చోబెట్టాం. ప్లీజ్, అక్కడనుంచి దిగజారకురా!" అన్నాడు చలం.

"అవసరమైతే మేం చందాలేసుకుని నీకు అప్పు యిస్తాం," అన్నాడు గోపీ.

"అప్పూ, గిప్పూ వద్దులేరా! రేపు రాత్రి పార్టీ!"

"హోటల్ డిలక్స్‌లో," అన్నాడు చలం.

"అలాగేరా,"

"దోశల్తో చాలదు! విస్కీ, బీర్ గోదావరి జలంలా ప్రవహించాలి." అన్నాడు గోపీ.

"అన్నింటికీ ఒప్పుకుంటున్నాను."

"డబ్బుతో రావాలిరా! లేకపోతే అందరం పప్పురుబ్బాలి!" అన్నాడు చలం.

అందరూ గొల్లున నవ్వారు.

* * *

పూజ ముగించి గోపాలం హుండీలో ఒక రూపాయి వేయబోయాడు. అతి కష్టంమీద రూపాయి లోపలకు వెళ్లింది.

"హుండీ నిండిపోయింది," అంది కాంతమ్మ.

"ఇవాళ మంచిరోజు. ఇప్పుడే పట్టుకెళ్లి రాములవారికి యిచ్చేస్తాను." అని అతడు లేచాడు.

హుండీ బరువుగా వుంది. పట్టు గుడ్డలో దాన్ని చుట్టి కట్టాడు. హుండీని పట్టుకుని రామనామం స్మరిస్తూ సమీపంలో వున్న రామాలయంవైపు అడుగులేశాడు.

రామాలయంలో ప్రశాంతంగా వుంది. శ్రీరాముడి పాదాలముందు హుండీని వుంచి అతడు కళ్లుమూసుకుని కొంతసేపు ప్రార్థిస్తూ వుండిపోయాడు. పూజారి యిచ్చిన ప్రసాదాన్ని తీసుకుని అతడు యింటివైపు నడిచాడు.

* * *

దినపత్రికలో ముద్రించిన నంబర్లను అతడు పదిసార్లు చూశాడు. తను కొన్న లాటరీ టిక్కెట్టుదే!

మొదటి బహుమతి 30 లక్షలు తనకొచ్చింది. రామనామం జపిస్తూ అతడు కళ్లు మూసుకున్నాడు.

"కాంతం!" పిల్చాడు.



అతడి భార్య వచ్చి ఎదురుగా నిలబడింది.

"కాంతం, ఆ శ్రీరాముడు తిరుక్కుంటే కాని కోటింగా మార్చగలడు," అన్నాడతను.

"ఏమైంది?"

"ఆ మధ్య లాటరీ టికెట్లు కొన్నాను, గుర్తుందా? ముప్పయి లక్షల మొదటి బహుమతి శ్రీరాముడు మన కిచ్చాడు, అంత డబ్బు ఎందు కిచ్చాడో!

"ముప్పయి లక్షలా!" అరిచింది కాంతమ్మ.

ఆమె గుండె వేగంగా కొట్టుకుంటోంది. ఆమె నేలమీద గెంతుతోంది పట్టలేని ఆనందంతో ఉక్కిరి బిక్కిరవుతోంది. వరదలా కొట్టుకొచ్చిన అదృష్టాన్ని భరించలేక ఆమె సతమతమవుతోంది.

గోపాలం ఆమెవైపు చూశాడు.

అతడి కళ్లు నీళ్లతో నిండాయి. "కాంతం! ముప్పయి లక్షలు వస్తున్నాయని వినగానే నువ్వు భూమ్మీద నిలబడలేక పోతున్నావు! ధనప్రీతి నీ సహజస్థితిని తారుమారు చేసేసింది!" అన్నాడతను.

"నాన్నా!" ఎవరో పిల్చారు.

వెనువెంటనే చలపతి అతడి ముందుకు ఏడుస్తూ వచ్చాడు. "అబ్బిగా, ఎందుకురా ఏడుస్తున్నావు!"

"ఫెయిలయ్యాను! నే చేసిన ఘోర పాపం నన్ను బెదిసికొట్టింది," అన్నాడు చలపతి

"అంత పాపం ఏం చేశావురా!"

"నాన్నా, నన్ను క్షమించు! పూజ గదిలో వున్న హుండీ పగలగొట్టి అందులోని డబ్బంతా తీసుకుని నా మిత్రులకు పార్టీ యిచ్చాను."

"పిచ్చిగా వుంటావురా! ఆ హుండీ అక్కడే వుంది. మూడురోజుల క్రితం పట్టుకెళ్లి దాన్ని శ్రీరాములవారికి అర్పించాను."

"అది నేను వేరే కొని అక్కడ పెట్టిన హుండీ నాన్నా! కొత్తది కొని దానికి పసుపు కుంకుమలు పులిమాను. అందులో కుండ పెంకులూ, కొబ్బరి పెంకులూ పడేసి అక్కడ పెట్టాను," అన్నాడు చలపతి.

"పాపాత్ముడా." అని అరిచి గోపాలం కళ్లు మూసుకున్నాడు.

రామనామం స్మరిస్తూ కొంతసేపు వుండిపోయాడు.

"ఏమండీ!"

అతడు కళ్లు తెరిచి చూశాడు. కాంతమ్మ ఎదురుగా వుంది.

"విచిత్రంగా వుందండి! రామాలయానికి తీసుకెళ్లి మీరు అర్పించిన కుండ పెంకుల, కొబ్బరి పెంకులకు ప్రతిఫలంగా ముప్పయి లక్షలు ఆ శ్రీరాముడు మీకిచ్చాడా!" అందామె.

శాంతంగా గోపాలం భార్యవైపు చూశాడు. అతడి కళ్లు జ్యోతుల్లా ప్రకాశిస్తున్నాయి.

"దైవానికి కావలసింది ధనం కాదు, కాంతం. భక్తి, ప్రేమ. భక్తితో నువ్వు ఏమిచ్చినా మహానందంతో భగవంతుడు స్వీకరిస్తాడు. వజ్రాలూ, వైడూర్యాలూ దేవుడి కక్కర్లేదు. యిరవైనాలుగ్గంటలూ మన సర్వాన్నీ దైవానికి అంకితంచేసి జీవించ గలిగినపుడే మనకు మోక్షం చేకూర్తుంది. ఈ జీవితమంతా రామలీల!" అన్నాడు గోపాలం.